# వలిహలి భవంతి

## శ్రీ వాకాటి పాండురంగారావు

"ఈ రోజుల్లో మనుషుల కన్నా ఎలుకలే ఎక్కువ ఉన్నట్లున్నాయి!" —అటక మీద నుంచి కృష్ణయ్య ఉవాచ. గంగకోసం ఆకాశం వేపు చూసిన భగీరథుని స్త్రీ వెర్షన్‌లా క్రింద నిలబడివుంది పంకజ.

వీధిలో లారీ వచ్చి ఆగింది. ఖాకీ చొక్కా, ఖాకీ పంట్లామూ తొడుక్కున్న బుర్ర మీసాల డ్రైవర్ వచ్చి "రెడీగా వున్నారాండీ?" అన్నాడు. వాడి వెనకాలే ఓ పాతికేళ్ల అబ్బాయి ప్రవేశించాడు. తెలుపు ఎరుపైన పాళ్లూ, నలుపు ఇరవై పాళ్లూ కలిసిన రంగులో కంటికి కమ్మగా కనుపించాడు. ధోవతి కట్టి, కోటు తొడుక్కుని మునిసిపల్ ఆఫీసు గుమాస్తాలా వున్నాడు.

"త్వర త్వరగా కానీయండి! ఆ తర్వాత అనవసరంగా వెయిటింగు ఛార్జీ ఇవ్వాల్సి వస్తుంది" అన్నాడా అబ్బాయి.

పంకజ ఆ అబ్బాయిని చూచింది. ఆ అబ్బాయి మొదటనుంచి పంకజను తప్ప మరేమీ చూడ్డం లేదు.

"మేం మాత్రం చేతులు ముడుచుకు కూర్చున్నామా ఏం? పొద్దున్నుండి సిద్ధమవుతుంటేను. ఎంతకూ తెములితేనా?" పంకజ ఆ మాటలన్నంత సేపూ అటకవేపే చూచింది. "పొద్దున లేచినప్పట్నుంచి. ఇక్కడ వెయిట్‌చేస్తున్నందుకు మీరు ఇవ్వాలి మాకు వెయిటింగు ఛార్జీ.. తెలుసా?" అంటూ దృష్టిని మరల్చింది.

"కాలేజీ స్టూడెంటు గామాల్ను" అనుకున్నాడా అబ్బాయి.

ఇంతసేపూ అటక మీద అల్లాడుతున్న కృష్ణయ్య "మీ మనుషు లొచ్చారా? ఈ బీరువా, ఆ పేర్లూ, పీటలూ, మూటలూ-అవీ లారీలోకి ఎక్కించమనండి" అని ఘోషించాడు.

నలుగురు కూలిమనుషులు లోపలికొచ్చి గబగబా సామాను తరలించడం మొదలెట్టారు. ఆ అబ్బాయి, వాళ్ళకు పని పురమాయిస్తూ వసారాలో నిలుచున్నాడు. కొన్ని తలుపు ఓరగా నుంచుంది పంకజ. "ఆ అబ్బాయి ముక్కు ఎంతచక్కగా వుంది!" హఠాత్తుగా ఆమె దృష్టి మళ్లింది.

"అరెరె! ఏవి టది...? ఆ పంచి నలా— ఆ పీటంగా దానిమీద అంత లావు పెట్టెను పెడుతున్నారేమిటి? ఏమండీ మిస్టర్ మీరుకూడా అలా చూస్తూ నుంచున్నారేం...? ఆ పంచి నలిగిపోదూ?"

"ఆ పంచిలో ఏమున్నాయమ్మా?" అని ప్రశ్నించాడు వాడు.

"ఫొటో లండీ! ప్రేము చేసిన ఫొటోలు!"

"ఊఁ!"

"'ఫ్రా' ఏమిటి—కాదు! అందులో నా వయొలిన్ క్లాస్ ఫోటో వున్నదండీ."

"వయొలిన్ అంటే నాకు మహా యిష్టం" అన్నాడా అబ్బాయి, కళ్ళు పెద్దవి చేస్తూ. 'అధిక ప్రసంగం' అనుకుంది పంకజ. అడుగు పెడదని అన్న పంచిని తిప్పుతూ వసారాలోకి నడచింది.

"హేయ్ అబ్బాయీ... ఆ పంచి మీద ఏమీ పెట్టకు, జాగ్రత్త... ఏం నాన్నా!... ఇంకేమయినా వున్నాయా?"

"అంతే నమ్మా. ఇది మొదట కదిలితే తర్వాత చిల్లర సామాన్లన్నింటినీ ఏ రిక్షాలోనో వుంచి తీసుకెళ్లి పోవచ్చు." అటక మీదనుంచి కృష్ణయ్య శిరోభాగం బయటకు వ్యాపించింది. ఆయన తల వంటింటి చూరులా వుంది.

"ఏమండీ మనం ఇహ కదలొచ్చా?" అన్నాడా అబ్బాయి.

అటకమీదనుండి కృష్ణయ్య ఇలా అన్నాడు: "ఇక్కడేదో వుంది ఎంత లాగినా రావడం లేదు!"

"బహుశః ఎలుకతోక అయివుంటుంది" అన్నాడా అబ్బాయి.

'హుం. ఎంత నిర్దాక్షిణ్యమనీ' అందామనుకున్నది పంకజ. "నాన్న ఎంత శ్రమపడుతున్నారో" అన్నది.

తను ఎంత లాగినా రాని వస్తువు అటకకు అరవై ముడులతో బంధింపబడిన చేంతాడని తేల్చుకున్న కృష్ణయ్య కాస్త అటక కింది లోకంలోకి దిగి "నీ పేరేమి టబ్బాయి?" అని అడిగాడు ఆ అబ్బాయిని.

"ప్రభాకర్."

"ఆ వేళ కంపెనీకి వచ్చినప్పుడు నీవు లేవనుకుంటాను."

"అవు నవును. ఆ రోజు మా సేనూ వున్నాడు. వాడి కివాళ గుండె నొప్పిగా వుందంటే నే వచ్చా... ఇహ మనం పోదామా?"

"ఆహా! ఇహ పోవడమే... ఏమమ్మా పంకజా! లారీతోబాటు నీవు వెళ్ళు" ప్రభాకరం పల్స్ వేగం పదింతలైంది.

"నేనా?" అంది పంకజ. ఆమెకు పోవాలని వుంది; పోకూడదనీ వుంది.

"అవునండి మరి. మీరెవరైనా వుండాలి మాతో. ఆ తర్వాత యీ బీరువా నిక్కడెందుకుంచారు. ఆ పెట్టె నిక్కడ పెట్టండి—అని ప్రారంభించకూడదు." అన్నాడు ప్రభాకరం అధికార స్వరంతో.

*"హుం" అని మెల్లగా అని "అయితే నేనే..."* అంటూ లారీలోకి ఎక్కబోతూ పంకజ, "నాన్నా! ఆయనొస్తారేమో!..." అంది.

"ఊఁ!" అన్నాడు ప్రభాకరం.

"ఏమిటి ?"

"అబ్బో! అవులింత వచ్చింది లెండి."

లారీ వెళుతోంది.

ప్రభాకరమూ, పంకజా డ్రైవర్ ప్రక్కనే కూచున్నారు. కూలి మనుషులు వెనకాలెక్కారు.

వీధి మలుపు తిరగ్గానే ఎందుకో బుగ్గను తాకి చూచుకుంది పంకజ. అరచేయి నల్లగా దుమ్ముతో నిండివుండడం గమనించింది. ఆమెకు ప్రభాకరంమీద యింతింతనరాని కోపం వచ్చింది.

"హుం! గాభరా పెట్టేశారు అనవసరంగా! మీరుంచే... మొహం కడుక్కోడానికిక్కూడా వీల్లేక పోయింది."

ప్రభాకరం తిరిగి చూచాడు. పాలరాయిలాంటి ఆవిడ బుగ్గమీద ఆవిడ చేయి తగిలిన చోట నల్లగా మచ్చ ఏర్పడింది. ఆవిడ కపోల సౌందర్యం మనోహరమైంది. "అలా మచ్చవుంటే ఎంతో బాగున్నారు!" అన్నాడు ప్రభాకరం.

"ఊ—?" అని వంకరగా చూచింది పంకజ. ఆమె కోపం పగిలిపోయింది.


లారీ యింకా వెడుతూనే వుంది.

పంకజ అంది: "ఏమిటది? ఈ సీట్లలో దూదికి బదులుగా ఏ ఎండు గడ్డినో, ఏ కొబ్బరి పీచునో పెట్టినట్లున్నారు మీ కంపెనీవాళ్ళు. ఎంత పీచికి గొట్టులో?... మీ యజమానితో చెప్పి కాస్త మంచి సీట్లు ఏర్పరచండి."


**9 STEPS TO SUCCESS**

*Think & Grow Rich*, by Napoleon Hill Rs. 4-14.
*The Art of Practical Thinking*, by Richard Weil, Rs. 4-14.
*How to Be A Leader*, by G. D. Halsey, Rs 4.
*A Plan of Life* (Technique of Living), by C. B. Purdom, Rs. 3.
*Secrets of Success & Self-Improvement*, by Herbert Casson. Rs. 2-8.
*Successful Living*, by Beran Wolfe, Rs 2-8.
*How to Develop Personal Power*, by D. Carlson, Rs. 3-7.
*Make the Most of Your Life*, by D. Lurton. Rs 4-8
*Efficiency for All*, by Herbert N. Casson Rs. 1-14.

**TARAPOREVALA'S**
"Treasure House of Books,"
210, HORNBY RD, BOMBAY-1.



"నాశనం చేశారు ముచ్చటైన అద్దాన్ని" అంది పంకజ

"ఈ సీట్లు నాబోటివారికోసం ఏర్పరచారుకాని మీ బోటి సుకుమారి మణులు కూర్చోడానికి కాదుగా!" అన్నాడు ప్రభాకరం చిరునవ్వుతో. పంకజ ఏదో అనుకుని ఊరుకుండిపోయింది. ఆవిడ బుగ్గ మీది మచ్చను చంద్రునిలోని జింకతో పోల్చుకున్నాడు ప్రభాకరం.

ఇంకా గమ్యస్థానం చేరలేదు లారీ. "ఈ వాహనానికి కిరాయి ఎంత?" అనడిగింది పంకజ.

"పది హేనురూపాయలు!"

"అన్యాయం! అక్రమం!

"శుద్ధ అన్యాయం! మహా అక్రమం!" పాతిక రూపాయ లివ్వండి అని హోరాహోరీ పోరాడాను మీ నాన్నగారితో. ఊహూ ఆయన కించిత్తయినా కదల్లేదు మరి." అన్నాడు ప్రభాకరం నవ్వు నాపుచేస్కుంటూ. ఇతనితో మాటాడి లాభం లేదన్నట్టు వెలుపలి వీధి పక్కకు చూచింది పంకజ.

లారీ ఆగింది. "ఇదేనండి ఆ వీధి! ఇంటి నెంబ రెంతా?" అన్నాడు డ్రైవర్ ప్రభాకరంతో.

"ఇంటి నెంబరెంతా?" అన్నాడు ప్రభాకరం పంకజ పక్కకు తిరిగి.

"ఇంటి నెంబరెంత?" అనుకుంది పంకజ తనలో. "అరి భగవాన్! ఇంటి నెంబరు మీకు తెలియదూ?" అంది ప్రభాకరంతో.

"బాగుంది. ఇల్లు మీరూ, మీ నాన్నా చూడ్డమూనూ, ఇంటినెంబరు నాకు తెలియడమూనా?. ."

"ఇల్లుచూడ్డానికి నేను రాలేదుగా! అప్పుడు నే నో పిక్ నిక్ కు వెళ్ళాను."

"అదిగో ఆ చిన్న పెంకుటిల్లే అయ్యుంటుంది: 'టు లెట్' బోర్డుకూడా వుంది చూశారుగామా?" అంటూ ప్రభాకరం వెళ్ళి ఆ బోర్డును తీసి గిరవాటు వేశాడు. పంకజ అతని వెనకాలే వెళ్ళి నిలబడింది.

"పోనీ యింటి తాళంచెవైనా పట్టుకొచ్చారా? లేక అదీ మరచి పోయారా?"

"అబ్బే లేదు ఇదిగో తెచ్చాను!" అని తాళం తీసిచ్చింది ప్రభాకరానికి. ప్రభాకరం ఆ తాళం ప్రయోగించాడు. తాళం కప్ప 'ఊహూ' అంది.

"బాగుంది వరస! మతిమరుపులో మీరూ మీ నాన్నను మించిపోతున్నారు... ఒకదానికొకటి పట్టు కొచ్చారన్నట్లే వుంది!" అన్నాడు ప్రభాకరం.

"అయితే ఇప్పుడేం చెయ్యడం?" అంది పంకజ నిస్సహాయంగా.

"అబ్బే! ఏమీ ఫరవాలేదు. ఇదుగో నా దగ్గర తాళం గుత్తి వుంది లెండి" అని రెండు నిమిషాల్లో తాళం తీశాడు ప్రభాకరం.

ప్రభాకరమూ, పంకజా గృహప్రవేశం గావించారు.

పంకజ యిల్లంతటినీ ఒక్కసారి చూచి వచ్చింది. "ఇంత చక్కటి ఇంటికి అద్దె నలభై రెండే! చాలా చౌక —కదూ?" అంది. తల ఊపాడు ప్రభాకరం.

కూలి మనుషులు సామాన్లు ఇంట్లోకి చేర్చడం మొదలెట్టారు.

పంకజ పెద్ద బీరువాను ముందుగదిలో వుంచమంది. అదే బాగుంటుందన్నాడు ప్రభాకరం. ఫోటోలన్నీ గోడలకు తగిలిస్తే అందంగా వుంటుందని సూచించాడు ప్రభాకరం. ఒప్పుకుంది పంకజ. పని చకచకా సాగి పోతున్నది.

ఉన్నట్టుండి "ఆయన రాలేదింకా! ఎందుకో?" అంది పంకజ ఆరాటంగా. ప్రభాకరం గుండె ఝల్లుమంది.

"ఈ 'ఆయన' ఎవరూ?" అన్నాడు

"మానాన్న ఫ్రెండు."

"ఆయన వయస్సెంతా?"

"యాభై వుండవచ్చు."

"హమ్మయ్య!"

ఆ 'హమ్మయ్య'కు వ్యాఖ్యానం కోరాయి పంకజ నేత్రాలు. ఇందాకటి 'హా'కు ఇప్పటి 'హమ్మయ్య' ఏమిటో తెలుసుకుం దామె.

"ఈ గోడలో మేకులు దింపి నిలువుటద్దాన్ని ఇక్కడ తగిలిస్తే బావుణ్ణు" అంది పంకజ.

"ఇదుగో! నిమిషంలో తగిలిస్తా" నని కోటు విప్పి చొక్కా చేతులు పైకి మడిచాడు ప్రభాకరం. మేకులు కొడుతున్నప్పుడు ప్రభాకరం చేతి కండరాలు బిగిసిన మెలికల్ని కన్నార్పకుండా చూసింది పంకజ.

మేకు అంత సులభంగా దిగలేదు. ప్రభాకరం చెమటతో తడిసి ముద్ద అవుతున్నాడు. మేకులు లాగి కొట్టాడు. చొక్కా చిరుగుంది భుజం దగ్గర.

"పాపం చొక్కా చిరిగినట్టుందే!"

"అబ్బే! లేదు లెండి."

ఎట్లాగేలకు, ఎలాగో ఓలాగు, మేకులు దింపి నిలువుటద్దాన్ని తగిలించి విజయ గర్వంతో వెనక్కు చూచాడు ప్రభాకరం. మందహాసంతో ముందుకొచ్చింది పంకజ. అద్దం ముందు నిలబడింది. అద్దంలో ఆమెతోబాటు ప్రభాకరమూ కనిపించాడు.

వెనక్కు తిరిగి "థ్యాంక్సు" అంది పంకజ.

"అబ్బో! ఇదేమంత పెద్ద..."

ఖణేల్‌మని మేకు ఊడింది. నిలువుటద్దం నిలువునా పగిలింది. "మేకు సరిగా దిగలేదల్లే వుంది" తల గోక్కుంటూ అన్నాడు ప్రభాకరం.

పంకజ నేలవైపు చూసింది. ఆమె కండ్లలో నీరు నిండినంత పనైంది. "నాశనం చేశారు—ముచ్చటైన అద్దాన్ని... కొని మూడేళ్లయినా కాలేదు! బంగారం లాటి అద్దం... ఖరీదు పదకొండు రూపాయలు..."

"చాల చవుక—కదూ?" అన్నాడు ప్రభాకరం. పంకజ పమిట చెంగు నడుము దగ్గర చెక్కుకుంది.

"అవన్నీ తర్వాత కానియ్యండి! మొదట పదకొండు రూపాయలూ ముందు కిందనుంచి తర్వాత మాట్లాడండి. లేకపోతే మీ లారీ ఛార్జీ పదిహేనులోనూ అద్దం ఖరీదుపోగా మిగత నాలుగు రూపాయలు మాత్రమే యిస్తాం" అంది పంకజ.

"అదేం కుదరదండోయ్ కుమారిగారూ! లారీలో సామాన్లు ఎక్కిస్తున్నప్పుడు, తెస్తున్నపుడు, దింపుతున్నపుడూ—ఏదైనా నష్టం వాటిల్లితే—అందుకు మాత్రమే మేము బాధ్యులం. ఇప్పుడీ సామాన్లను తీసుకురావడం, దింపడమూ కూడా జరిగింది. పోతే—ఈ అద్దమంటారా, మీ యిష్టానుసారమే తగిలించబడింది."

గుడి గంటలా పలికింది పంకజ: "ఆ కబుర్లు కట్టిపెట్టండి మిస్టర్! మళ్లీ మాటామాటంటే అద్దం ఖరీదు పెంచేస్తా. అంతే! మీ లారీ ఛార్జీకి సరిపోతుంది."

ప్రభాకరం కాసేపు అటూ యిటూ చూశాడు. పెదవివిరిచి, "ఏదో ఒకటి. మీ యిష్టం వచ్చినట్టు చేయండి. మీకే ధర్మం కాదు మరి..." అంటూండగా "అమ్మాయీ పంకజా!" అంటూ నెరిసినతలతో ఒకాయన లోపలికి వచ్చాడు. ఆయనే యింటాకటి 'ఆయన' అని ప్రభాకరం గ్రహించాడు.

"జరగ వలసిందంతా జరిగినతరవాత నింపాదిగా వస్తున్నారేం?" అంది పంకజ.

"అది కాదమ్మా!... మీరు ఈ ఇంటో కెందుకు దిగారూ? నేనూ మీనాన్నా చూచింది, అడ్వాన్సు యిచ్చిందీ ఇరవై ఏడో నెంబరు ఇంటికమ్మా!" అని చల్లగా వెల్లడించారు తెల్లవెంట్రుకలాయన. "ఆ ఇల్లేమో తాళంతీయకుండా అలాగే వుంది, మీ రేమో ఇక్కడ..."

రెండు కణతల్నీ గట్టిగా చేత్తో పట్టుకుంది పంకజ. "ఇంత అల్లకల్లోలమూ యీయన్నించే! స్స్... అబ్బబ్బ! మళ్లీ ఒక యుద్ధానికి సిద్ధం కావాలి కాబోలు ... హూం! ... ఏమండోయ్! మిస్టర్ లారీ కంపెనీగారూ ... మిమ్మల్నే! మనుషుల్ని పిలవండి. సామాన్లు తరలిద్దాం..." అంది స్వరం నిప్పులు కురిపిస్తూ.

ప్రభాకరం "ఏమండీ! మీరు అడ్వాన్సిచ్చిన ఇల్లెక్కడుంది?" అని ముసలాయన్ని అడిగాడు.

"ఈ వీధి కొసన వుంది."

"ఇదిగో మిస్ పంకజా!" ప్రభాకరం శాంతంగా మాట్లాడసాగాడు. "ఈ వీధి కొసను ఇల్లుంటే కనీసం మైలుదూర ముంటుంది. ఈ సామాన్లన్నింటినీ మరలా లారీలోకి ఎక్కించి, మోసుకెళ్లి, అక్కడ దింపమంటే మీరు అదనంగా పదిరూపాయలివ్వాల్సి వుంటుంది. అంటే మీ అద్దం ఖరీదు చెల్లిందనుకోవచ్చు."

"ఇది చాలా బావుంది. ఈ ఇంట్లో దూరమున్నది మీరా, నేనా?" అని మండిపడింది పంకజ.

"అయితే మరి, నే నీ యింటితాళం తీస్తున్నప్పుడు నోరు మూసుక్కూచున్నా రెందుకూ? అప్పుడే చెప్పకూడదూ?"

"అవన్నీ నాకు తెలియవు. డబ్బు రాగికానీ కూడా రాలదు. ఏమైనా రానీ!" అంది పంకజ.

"డబ్బు లేకుండా ఇక్కణ్ణుండి రాగి చెంబుకూడా కదలదు. ఏదైనా కానీ!" అన్నాడు ప్రభాకరం.

"హుఁహ్" అని వీధి వేపునకు గిరుక్కున మొహం తిప్పుకుంది పంకజ. ఆమె జడ నాట్యమాడింది.

సరిగా అప్పుడే అవతరించాడు కృష్ణయ్య. "ఇదేమిటమ్మా పంకజా! ఇదేదో ఇంట్లోకి..." ఆయన అవాక్కుయిండే. పంకజా, ప్రభాకరమూ, ముసలాయనా కలిసి ఒకసారే పరిస్థితుల సమీక్షను సాగించారు.

కాసేపటికి అందరూ కాస్త తగ్గారు. కృష్ణయ్య ప్రభాకరంతో, "ఏమి టబ్బాయి! నీ వెంతో మంచివాడ వనుకున్నానే. ఇప్పుడీ విధంగా అన్యాయం..." ప్రభాకరం మధ్యలోనే అందుకున్నాడు:

"అన్యాయ మేమిటండీ! న్యాయంగా మాట్లాడితే నేను ఏమైనా చేస్తాను. కానీ వస్తే బుకాయించడానికి మొదలిడితే...",

"ఇక్కడ ఎవరూ బుకాయించ లేదు" —పంకజ గొణుగుడు.

"ఇదుగో అబ్బాయ్! నీ వ్వెవరూ ఏమీ..." అని కృష్ణయ్య రాజీకి ప్రయత్నించాడు.

"మరేమండీ! మొహం సరిగ్గా తెలియని వెధవ అద్దానికి పదీ పదిహేనూ అడిగితే..."

"అదేం వెధవ అద్దం కాదు..." మళ్లీ పంకజే!

కృష్ణయ్య ప్రభాకరం భుజాలు పట్టుకుని "స్స్! అమ్మాయి మాటలకేంలెద్దూ? దాన్నలా వదిలేయి... యిప్పు డేంచేద్దామంటావు?" అని ప్రభాకరాన్ని నెమ్మదిగా అడిగాడు.

"మారుమాట మాట్లాడకుండా ఇక్కడే వుండిపొండి. అన్నాడు" కాని పంకజ కోపం చల్లార లేదు.

"ఎంత కోరిక! ఈ ఇంటివాడెవడో వచ్చి అనుమతి లేకుండా లోపలికి వచ్చారని మెడబట్టి గెంటితే చూచి చప్పట్లు కొడదామనా?" అని అడిగింది కసి తీరేటట్లు.

"అనుమతి లేకుండా ఎవరొచ్చారూ? ఇంటి యజమానే స్వయంగా తన చేతులతో తాళం తీసిలోపలికి రమ్మంటే" అన్నాడు ప్రభాకరం.

"ఏమిటీ...!" అన్నారు కృష్ణయ్య.

పంకజ శిల్పమైంది. నోట మాట రాలేదు.

"అవును ఈ ఇల్లు నాదే!" అన్నాడు ప్రభాకరం.

కృష్ణయ్య "బావుంది! బేష్! మహా బావుంది!" అని అతి ఉత్సాహంతో మొదలుపెట్టి చప్పున చల్లబడి పోయి..." అయితే... ఆ యింటికి ఎల్లుండే రెండు రూపాయలిస్తానన్నాను.. ఇంత పెద్ద ఇంటికి..."

"దీనికీ అంతే యివ్వండి...చాలు."

"బంగారు కొండవు కదోయ్!" అని "పట్నంలో ఇంత పెద్ద ఇంటికి యజమానిగా వుంటూ కేవలం ఒక లారీకంపెనీ గుమాస్తాగా వుంటున్నావేంటోయ్" అని అడిగాడు కృష్ణయ్య.

"అలాగని ఎవ రన్నారూ?" అంటూ దొడ్లో నూతివేపునకు వెళ్లిపోయాడు ప్రభాకరం.

ఆ పక్కనే వున్న లారీ డ్రైవర్ గర్వం నిండిన నవ్వుతో "గుమాస్తా కాదండి. ఆయనే మా కంపెనీ యజమాని. చాలా గమ్మత్తు మనిషిలెండి!" అన్నాడు.

"కంపెనీ యజమానా! .. చాలా మంచివాడు! వజ్రపు తునక! .. కుర్రాడు బాగున్నాడు కాదమ్మా?" అంటూ కృష్ణయ్య ప్రక్కకు తిరిగే సరికి పంకజ పక్క గదిలోనికి పరుగెత్తింది.

"పేరు ప్రభాకరం... పిల్లగాడు అమ్మో!" అనుకుంటూ కృష్ణయ్య నూతి వైపునకు నడక సాగించాడు.

కళ్ళు మూసుకుని కొత్త లోకాన్ని చూడసాగింది తన వలపుల భవంతి కిటికీలో కూర్చున్న పంకజ. ✱

## మాటకారి

సిగ్గుపడే యువకుడు తను ప్రేమించిన యువతిని తన కారులో షికారు తీసుకు వెళుతూ హఠాత్తుగా ఇలా అన్నాడు.

"శారదా! నన్ను పెళ్లాడతావా?"

"ఊఁ" అందామె.

ఒక గంట వరకూ యిరువురూ ఏమీ మాట్లాడుకో లేదు. కారు వెళుతూనే వుంది. చివరకు ఆమె కంగారుగా ఇలా అంది.

"రామూ! నువ్వేమీ మాట్లాడవేం? ఏదో ఒకటి చెప్పకూడదూ?"

"ఇంకా ఏం చెప్పను?" అన్నా డతడు.